నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 274 | పేజీలు: 4 | వెల: రూ.4/- | ఆదివారం 31 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

### మోటర్లకు మీటర్లు పెడితే

# ఎన్నికల్లో పోటీచేయను

## ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పకుంటా



మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పకుంటా

లేపకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పకుంటుందా

రైతుల ముసుగులో లబ్దికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు

ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం

కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం

హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు


మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్

మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మే30 (నమస్తే ఉదయం):**

తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ది కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ

..మిగతా 2లో




### పుప్పాలగూడ పరిధిలో

# ముష్కిన్ చెరువుకు విముక్తి

## హైడ్రా మరో భారీ అపరేషన్

**హైదరాబాద్, మే 30 (నమస్తే ఉదయం)**

హైడ్రా మరో భారీ అపరేషన్ చేపట్టింది. కబ్జాకు గురైన చెరువును పరిరక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-నార్సింగి గ్రామాల పరిధిలో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ముష్కిన్ చెరువు అభివృద్ధి పేరుతో చేస్తున్న కబ్జాలకు చెక్ పెట్టింది. చెరువులో.. రూ.5,500 కోట్ల విలువైన కబ్జాలను తొలగించి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తోంది. హెచ్‌ఎండీఏ లెక్కల ప్రకారం చెరువు 52.20 ఎకరాల పరిధిలో ఉండగా.. చెరువు మధ్యలోంచి కట్ట నిర్మించి 34.21 ఎకరాలు కబ్జా చేసే ప్రయత్నం జరిగిందని హైడ్రా పేర్కొంది. సీఎస్ఆర్ నిధులతో చెరువు అభివృద్ధి

..మిగతా 2లో

### నోటీసులివ్వకుండా కూల్చివేతపై

# హైకోర్టు ఆగ్రహం

24 గంటల్లో చర్యలు చేపట్టాలని హైడ్రాకు ఆదేశం

హైడ్రాపై ఆగ్రహించిన హైకోర్టు

కూకట్‌పల్లిలోని ఎన్వీఎన్ కన్‌స్ట్రక్షన్‌కు ఊరట

సెక్యూరిటీ రూమ్, ఫెన్సింగ్, ప్రవేశద్వారం తిరిగి నిర్మించాలని ఆదేశం

24 గంటల్లో చర్యలు చేపట్టాలన్న హైకోర్టు

### టెక్నికల్ సేవల కోసం

# డిజిపి టెక్ టీమ్ ఏర్పాటు

ఫిర్యాదుదారులకు అందుబాటులో పోలీసులు

పనితీరు మెరుగు పర్చుకుని సాగాలి

పోలీస్ అధికారులతో డిజిపి ఆనంద్ సమీక్ష



**హైదరాబాద్,మే30 (నమస్తే ఉదయం):**

ఫిర్యాదుదారుల కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని డీజీపీ ఆనంద్ సూచించారు. సీసీటీఎన్ఎస్ వ్యవస్థ పనితీరు సరిగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ల నుంచి ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన డీజీపీ, పాత పద్ధతులను విడిచిపెట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి క్రమశిక్షణతో

..మిగతా 2లో

### జూన్ 3న ముఖ్యమంత్రిగా

# డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం


కర్నాటక సిఎల్‌పి నేతగా డికె ఏకగ్రీవ ఎన్నిక

3న ప్రమాణ స్వీకారానికి పార్టీ నిర్ణయం

డికెను సిఎల్‌పి నేతగా ప్రతిపాదించిన సిద్దరామయ్య

నాయకత్వ మార్పు

సజావుగా జరిగిందన్న కెసి వేణుగోపాల్



**బెంగళూరు,మే30 (నమస్తే ఉదయం):**

కర్ణాటక కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నేతగా ఎన్నికైన డీకే శివకుమార్ జూన్ 3న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఆయన ప్రమాణ తేదీ అధికారికంగా ఖరారైంది. జూన్ 3న కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేస్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం సాయంత్రం

..మిగతా 2లో

### కేంద్రాన్ని విమర్శించడం తప్ప

# చేసిందేమీ లేదు

మోసపు హామీలతో గద్దెనెక్కి దగా

కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు

బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు

మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి

**హైదరాబాద్,మే30 (నమస్తే ఉదయం):**

మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని.. తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి వెళ్ళే వరకు మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి

..మిగతా 2లో





# ఎంపి అభిషేక్ బెనర్జీపై దాడి

కోడిగుడ్లు, చెప్పలు విసిరిన స్థానికులు

ఇదంతా బిజెపి పన్నాగమన్న అభిషేక్

**కోల్‌కతా,మే30 (నమస్తే ఉదయం):**

మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు సోనార్‌పుర్ వెళ్లిన ఆయనపై స్థానికులు రాళ్లు, కోడిగుడ్లు చెప్పులు విసిరారు. కొందరు ఆయనపై చేయి చేసుకున్నారు. అభిషేక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గో బ్యాక్ అంటూ దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దాడి జరుగుతున్న సమయంలో అభిషేక్ బెనర్జీ హెల్మెట్ ధరించగా.. భద్రతా సిబ్బంది ఆయనకు రక్షణగా నిలిచారు. అనంతరం చిరిగిన చొక్కాతో ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనకు భాజపానే కారణమని ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే దాడి చేశారని.. తనను చంపేందుకు ప్రయత్నించారని అన్నారు. దాడి సమయంలో పోలీసులు ఎక్కడా కనిపించలేదన్నారు. ఈ ఘటనపై న్యాయపోరాటం చేస్తానని తృణమూల్ నేత పేర్కొన్నారు.



### తుంగభద్రలో మునిగి

# ఐదుగురు గల్లంతు

మంత్రాలయం వద్ద విషాద ఘటన

**కర్నూలు,మే30 (నమస్తే ఉదయం):**

మంత్రాలయం వద్ద విషాదం చోటుచేసుకుంది. తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లిన ఐదుగురు గల్లంతయ్యారు. హైదరాబాద్‌కు చెందిన యువన్ చంద్ర (5), సతీష్ (35), మంత్రాలయంకు చెందిన రాఘవేంద్ర (25), ధను (23), ఉరవకొండకు చెందిన సంధ్య (22) నదిలో గల్లంతైన వారిలో ఉన్నట్లు

..మిగతా 2లో

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

మొదటి పేజీ తరువాయి...

చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ది కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల

ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన ఢిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## జూన్ 3న ముఖ్యమంత్రిగా
# డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించారు. సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నికైన అనంతరం మీడియాతో ఆ వివరాలను కేసీ వేణుగోపాల్ పంచుకున్నారు. సీఎల్పీ నేతగా డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు చెప్పారు. డీకే పేరును కాంగ్రెస్ అధిష్టానం సూచించగా, తొలుత సిద్ధరామయ్య, ఆ తర్వాత పరమేశ్వర ఆయన పేరును సీఎల్పీ సమావేశంలో ప్రతిపాదించారని, ఏకగ్రీవంగా దీనికి ఎమ్మెల్యేలు ఆమోదం తెలిపారని వివరించారు. ముఖ్యమంత్రి మార్పు కాంగ్రెస్ పార్టీకి సమస్య అవుతుందని అంతా భావించారనీ, అయితే తమదంతా ఒక కుటుంబమని, అంతా ఏకగ్రీవంగా ఈ ఎన్నికను ఆమోదించడం పార్టీకి గర్వకారణమని అన్నారు. 2028లోనూ నాయకులందరికీ సపోర్ట్‌తో కర్ణాటకలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలతో సిద్ధరామయ్య ఈనెల 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యకు గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇదిలావుంటే అంతకుముందు కర్ణాటకలో నాయకత్వ మార్పు ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా డీకే శివకుమార్ ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్ పేరును మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించగా సీనియర్ నేత పరమేశ్వర బలపరిచినట్లు తెలిసింది. మరోవైపు జూన్ 3న నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. ఇందుకోసం బెంగళూరులోని లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలిపింది. తాజాగా సీఎల్పీ నేతగా ఎన్నికైన డీకేఎస్.. గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు తనను ఆహ్వానించాలని కోరనున్నారు. పరిశీలకులుగా కెసి వేణుగోపాల్,జైరాం రమేశ్ హాజరయ్యారు.

## కీ బోర్డు వాయించడంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు



**బుద్వేల్, మే30 (నమస్తే ఉదయం)**

హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సందర్భంగా గచ్చిబౌలి విక్టరీ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గిన్నిస్ అచీవర్స్ మీట్ లో బుద్వేల్ కు చెందిన థామస్ స్టీఫెన్ రాజ్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్నాడు. ఆయనకు హల్లెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వాహకులు అగస్టీన్ దండింగి సర్టిఫికెట్ ను అందజేశారు. 2026 ఫిబ్రవరి 2వ తేదీన హైదరాబాద్ లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల ఆధ్వర్యంలో రెండు వేల మంది కీ బోర్డు వారు ద్యకారులు గంట పాటు కీబోర్డు ఆగకుండ వాయిస్తు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో కీ బోర్డును వాయించడంలో ప్రతిభ ను చూపిన 777 మంది విద్యార్థులు ఎంపికైనారు. అందులో థామస్ స్టీఫెన్ రాజు కూడా సర్టిఫికెట్ అందుకున్నారు.



పాస్టర్ అగస్టీన్ చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ ను అందుకుంటున్న థామస్ స్టీఫెన్ రాజ్

## గట్టు మండలం అభివృద్ధి చెందాలంటే
## పిల్లల చదువు, హక్కులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 30(నమస్తే ఉదయం)**

గ్రామాల్లో జెండర్ సమానత్వం సాధించడంతో పాటు పిల్లల హక్కుల పరిరక్షణకు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంవీ ఫౌండేషన్ స్టేట్ చీఫ్ కో-ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డి గ్రామ రైతువేదికలో 14 గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు జెండర్ సమానత్వంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, మొదటిసారి ఎన్నికైన సర్పంచులకు అభినందనలు తెలిపారు. గ్రామాల్లో పిల్లల సమస్యలను ప్రధానమైనవిగా గుర్తించకపోవడం వల్లే ప్రగతిలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసియా ఖండంలోనే గట్టు ప్రాంతం వెనుకబడి ఉందనే మాటను 20 ఏళ్లుగా వింటున్నామని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు ఆ ముద్రను చెరిపేయడానికి కృషి చేయాలన్నారు. పిల్లల సమస్యలను రాజకీయ సమస్యలుగా గుర్తించి, చదువు, వనరుల విషయంలో ప్రభుత్వం నుండి ప్రత్యేక ప్యాకేజీ సాధించేలా ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లల సమస్యలను ఆలకించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. గట్టు ఎస్ఐ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాలలోని యువత పండుగలు, సంబరాల వేళ సందెరాల ప్రదర్శనకోసం మత్తు పదార్థాలను వాడి చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిపై సర్పంచులు నిఘా పెట్టాలన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, గట్టు మండలం అన్ని రంగాలలో ముందుకు రావాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. బడి ఈడు పిల్లలందరినీ బడిలోనే చేర్పించే బాధ్యతను ప్రజాప్రతినిధులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ జిల్లా ఇంచార్జ్ సాయి కుమార్, మండల ఇంచార్జ్ కిరణ్ కుమార్, మొబిలైజర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సీఐటీయు ఆవిర్భావ దినోత్సవాలు


బుద్వేల్ ఫిల్టర్ బెడ్స్ వద్ద సీ ఐ టీ యూ జెండా ఎగురవేస్తున్న జె రుద్ర కుమార్



కాటేదాన్ సీఐటీయూ కార్యాలయం వద్ద సీ ఐ టీ యూ వ్యవస్థాపకులు కామ్రేడ్ బీ టీ రణదేవ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీ ఐ టీ యూ నాయకులు

**బుద్వేల్, మే30 (నమస్తే ఉదయం)**

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటీయు) 56వ ఆవిర్భావ దినోత్సవాలను శనివారం బుద్వేల్ ఫిల్టర్ బెడ్స్ లేబర్ అడ్డా వద్ద సీఐటీయు నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బచ్చలకూర స్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సీఐటీయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జె రుద్రకుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 1970 మే 30న దేశంలో కార్మిక వర్గ పోరాటానికి కొత్త అధ్యాయం మొదలైందన్నారు. కార్మికుల హక్కుల కోసం సీఐటీయు ఏర్పాటు జరిగిందన్నారు. సీఐటీయు ఆధ్వర్యంలో ఎనిమిది గంటలు పనిదినాల కోసం, కనీస వేతన చట్టాల కోసం, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం కృషి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు చంద్రశేఖర్, వెంకన్న, రాము, ఇజ్రాయేల్, జహంగీర్, రంగస్వామి, మొగిలి క్రిష్ణ, చింటు నాయక్, నర్సింగ్ రావు, శ్రీరాములు లు పాల్గొన్నారు.

**కాటేదాన్ సీఐటీయు కార్యాలయం వద్ద కామ్రేడ్ బీ టీ రణ దీవే చిత్రపటానికి నివాళులు :**

కాటేదాన్ సీఐటీయు కార్యాలయం ఆవరణలో సీఐటీయు వ్యవస్థాపకులు బీటీ రణదీవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో సీఐటీయు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు వెంకటయ్య, రేఖ నాయక్, శ్రీనివాస్, అంజయ్య, రాములు లు పాల్గొన్నారు.



## కేంద్రాన్ని విమర్శించడం తప్ప
# చేసిందేమీ లేదు

మొదటి పేజీ తరువాయి...

ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమిషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమిషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే ఫెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్ని బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని పదేపదే చెపుతున్నారు. ధాన్యం సేకరణపై కేంద్రం గతంలో 9 సార్లు పొడిగింపు ఇచ్చింది. ఎప్పుడూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేదు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలో బీర్ఎస్ అదే పని చేసింది. కేంద్రం ఇప్పటి వరకు ఇచ్చిన కోటను పూర్తి చేయలేదు. 52.24 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రంతో ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.

## తుంగభద్రలో మునిగి ఐదుగురు గల్లంతు

మొదటి పేజీ తరువాయి...

తెలుస్తోంది. మంత్రాలయంలోని ఓ ఇంట్లో జరిగిన సత్యనారాయణ స్వామి పూజకు హాజరైన బంధువులు, పూజ అనంతరం సమీపంలోని తుంగభద్ర నదికి వెళ్లి ఈతకు దిగినట్లు సమాచారం. నీటి లోతు అంచనా వేయకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలుస్తోంది. ఘటనలో ఆదోనికి చెందిన అపర్ణ సురక్షితంగా బయటపడినట్లు అధికారులు తెలిపారు. గల్లంతైన వారిని గుర్తించేందుకు పోలీసులు, మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఒక మృతదేహం లభ్యమైదినట్లు సమాచారం. గల్లంతైన మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## టెక్నికల్ సేవల కోసం డిజిపి టెక్ టీమ్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి...

వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని డీజీపీ తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణపై ప్రతి అధికారి కట్టుబడి పనిచేయాలని సూచించారు. త్వరలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో, ఫుడ్ అడల్టేషన్ వింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. జూనియర్లు సీనియర్లకు గౌరవం ఇవ్వాలని, పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. టెక్నికల్ సేవల కోసం ప్రత్యేకంగా డీజీపీ టెక్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనర్లు క్రైమ్ రివ్యూ తప్పకుండా నిర్వహించాలని, యూనిట్ హెడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని డీజీపీ ఆనంద్ ఆదేశించారు.

## పుప్పాలగూడ పరిధిలో ముప్కిన్ చెరువుకు విముక్తి

మొదటి పేజీ తరువాయి...

పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ.. అభివృద్ధి మాటున కబ్జాకు ప్రయత్నించింది. గ్రామ రికార్డుల ప్రకారం చెరువు పరిధి 59.11 ఎకరాలు కాగా.. ఇందులో ప్రభుత్వ శిఖం 20.23 ఎకరాలు, మిగతా అంతా పట్టాభూమి. అక్కడ ఎలాంటి నిర్మాణపనులు చేపట్టరాదనే నిబంధల్ని ఉల్లంఘించిన రియల్టర్లు.. పేదల పేరుతో గుడిసెలు వేసి కొట్టేయాలని ప్రయత్నించారు. ఖాళీ చేయాలని రెండు నెలల సమయం ఇచ్చిన హైడ్రా .. హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేస్తోంది. చెరువు మధ్యలో వేసిన కట్టను తొలగించింది.

## నోటీసులివ్వకుండా కూల్చివేతపై
# హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, మే 30 (నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లిలోని ఎస్వీఎన్ కన్‌స్ట్రక్షన్‌కు హైకోర్టులో ఊరట లభించింది. హైడ్రా నోటీసులివ్వకుండా కూల్చివేయడంపై హైకోర్టు ఆగ్రహించింది. ఎస్వీఎన్ కన్‌స్ట్రక్షన్ స్థలంలో హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. ఈనెల 25కు ముందున్న యథాతథ స్థితి కొనసాగించాలని ఆజ్ఞాపించింది. సెక్యూరిటీ రూమ్, ఫెన్సింగ్, ప్రవేశద్వారం తిరిగి నిర్మించి ఇవ్వాలని ఆదేశించింది. ఎస్వీఎన్ కన్‌స్ట్రక్షన్ స్థలానికి విద్యుత్ కనెక్షన్ తిరిగి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఉత్తర్వుల కాపీ అందిన 24 గంటల్లో చర్యలు చేపట్టాలని హైకోర్టు వెల్లడించింది. ఒకవేళ హైడ్రా చేయకపోతే ఎస్వీఎన్ కన్‌స్ట్రక్షన్ పునరుద్ధరించుకోవచ్చని తెలిపింది. ఆ ఖర్చులను హైడ్రా అధికారుల సొంత ఖాతా నుంచి వసూలు చేసుకోవాలన్న చెప్పింది. కుంట అనడానికి ఆధారాలు లేవని నీటిపారుదలశాఖ అఫిడవిట్‌లో పేర్కొందని హైకోర్టు వెల్లడించింది.

# ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించినపుడే
# వ్యక్తులు, సంస్థ పురోగతి సాధ్యం



లక్ష్మీనారాయణ - సుజాత దంపతులను సన్మానించి జ్ఞాపిక ను బహుకరిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యా సాగర్, డీన్ లు డాక్టర్ కేజీ ఈశ్వరి, డాక్టర్ ఝాన్సీ రాణి లు



హరిసింగ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు ఎం శ్రీనివాస్ యాదవ్, ఎస్ జయరాం తదితరులు



నర్సింగ్ రావు ను సన్మానిస్తున్న అధికారులు

## వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్.

**బుద్వేల్, మే 30 (నమస్తే ఉదయం) :**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం లో ఆఫీస్ సబ్ ఆర్డినేట్ గా పని చేస్తున్న హరి సింగ్, డ్రైవర్ గా పని చేస్తున్న ఈ. లక్ష్మీ నారాయణ లు ఈ నెల 31 వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పరిపాలనా భవనం కమిటీ హాల్ లో వారికి శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.దీనికి ముఖ్య అతిధి గా హాజరు అయిన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్ వారిద్దర్నీ సన్మానించారు.సుదీర్ఘ కాలం వారిద్దరూ విశ్వవిద్యాలయానికి అందించిన సేవలని కొనియాడారు. ప్రతి ఉద్యోగి తన విధులని నీతి, నిజాయితీ లతో నిర్వర్తించినపుడే వ్యక్తి గత పురోగతి, సంస్థ పురోగతి సాధ్యం అవుతుందని రిజిస్ట్రార్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న బోధన, బోధనేతర సిబ్బంది హరిసింగ్, లక్ష్మి నారాయణ లతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.వారు విశ్వ విద్యాలయానికి అందించిన సేవలని అభినందించారు. ఎ ఆర్ ఐ లో పని చేస్తున్న నర్సింగ్ రావు ను అక్కడి అధికారులు సన్మానించారు.

## ఆర్థిక ఇబ్బందులతో తల్లి కొడుకుల ఆత్మహత్య

**బుద్వేల్, మే 30 (నమస్తే ఉదయం)**



ఆత్మహత్య చేసుకున్న వీరమ్మ ,



ఆత్మ హత్య చేసుకున్న నర్సింలు

ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లి కొడుకులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడ రాజీవ్ గృహ కల్ప వైట్ బిల్డింగ్స్ లో శుక్రవారం రాత్రి జరిగింది. తల్లి కొడుకుల మరణం గురించి శనివారం వారి దగ్గరి బంధువు అయిన వ్యక్తి మైలార్ దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలను ఎస్ఐ పైడి నాయుడు వెల్లడించారు. వికారాబాద్ కు చెందిన వీరమ్మ (50), నర్సింహులు (28) తల్లి కొడుకులు. బ్రతుకు దెరువు కోసం మూడు నెలల క్రితం లక్ష్మీగూడ రాజీవ్ గృహ కల్ప ప్రాంతానికి వచ్చారు. ఆర్థిక సమస్యలతో బాధ పడుతున్నారు. పేదరికం వల్ల కొడుకు నర్సింహులు కు పెళ్లి కావడం లేదు. దీంతో మనస్థాపానికి గురైన వీరమ్మ శుక్రవారం తాము అద్దెకుంటున్న ఇంట్లో ని ఫ్యానుకు చీర తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి మరణాన్ని చూసి తట్టుకోలేని కుమారుడు నర్సింహులు ఎలుకల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వారి దగ్గరి బంధువు అదే ప్రాంతంలో నివాసం ఉండే నర్సింహులు గమనించి మైలార్దేవుపల్లి పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ పైడి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని తల్లి కొడుకుల మృతదేహాలను పోస్టుమార్గం నిమిత్తం ఉస్మానియా మార్చ్యూరీకి తరలించారు. కేసు దర్యాప్తు లో ఉంది.

## కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి,మాజీ మంత్రి బినయ్ విశ్వం స్వాగతం పలికిన నాయకులు

**రాజేంద్రనగర్,మే30(నమస్తే ఉదయం)**



హైదరాబాద్ కు విచ్చేసిన కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి,మాజీ మంత్రి బినయ్ విశ్వం శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే. రామస్వామి,జిల్లా కార్యవర్గ సభ్యులు పి. యాదగిరి,వడ్ల సత్యనారాయణ,జిల్లా కౌన్సిల్ సభ్యులు జైపాల్ రెడ్డి,శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి,శ్రీను తదితరులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు.



## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్వయం ఉపాధి శిక్షణ తప్పనిసరి..

**పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ జ్ఞాన ప్రకాష్**

**రాజేంద్రనగర్,మే30(నమస్తే ఉదయం)**

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్వయం ఉపాధి కొరకు వివిధ రంగాలలో శిక్షణలు పొందాలని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ జ్ఞాన ప్రకాష్ అన్నారు.పాలు పాల పదార్థాలు,ఉత్పత్తులు శిక్షణ ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి నాబార్డ్ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో ఎస్ అండ్ టి సిరి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో గల 30 మంది సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులకు శిక్షణ పూర్తి పూర్తిచేసుకుని పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ సందర్శనకు వచ్చిన మహిళలను అభినందించారు.పాలు,పాల పదార్థాలు, ఉత్పత్తులు,పాడి సంరక్షణ అంశంపై గత పది రోజులుగా శిక్షణను గురించి తెలుసుకొని వారిని ఉద్దేశించి మహిళలు గ్రూపుగా ఏర్పడి మహిళలు పాలు పాల పదార్థాలు ఉత్పత్తులను రూపొందించి బ్రాండింగ్ ప్యాకింగ్ చేసి యాదాద్రిలో గల దేవస్థానంలో దాని హైదరాబాద్ లో గాని ఇతర పెద్ద పెద్ద పట్టణాలలో మార్కెటింగ్ చేసుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలని పాల పదార్థాలను ముఖ్యంగా పరిశుభ్రంగా ఉండే విధంగా రూపొందించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమం నిర్వహించిన సిరి స్వచ్ఛంద సేవా సంస్థను అధ్యక్షులు ఎదునూరు శ్రీనివాసును అభినందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషన్ కుమార్ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్,డాక్టర్ మాధురి అసోసియేట్ డీన్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ డాక్టర్ సాహిత్య రాణి అసోసియేట్ ప్రొఫెసర్ స్నేహ ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.



## యువతకు కర్రసాములో ఉచిత శిక్షణ..

**గౌతమ్ ఎంటర్ప్రైజెస్ సంస్థ చైర్మన్ డాక్టర్ బాలరాజ్ ముదిరాజ్**

**రాజేంద్రనగర్,మే30(నమస్తే ఉదయం)**

యువతలో ధైర్యం,క్రమశిక్షణ,దేశభక్తి,ఆత్మరక్షణ భావనలను పెంపొందించలనే లక్ష్యంతో కర్ర సాము శిక్షణ తరగతులను నిర్వహించినట్టు గౌతమ్ ఎంటర్ప్రైజెస్ సంస్థ చైర్మన్ డాక్టర్ బాలరాజ్ ముదిరాజ్ వెల్లడించారు.సంస్థ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా 200మంది యువతీ,యువకులకు ఉచితంగా కర్ర సాము,కత్తి సాములో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించారు.రాజేంద్రనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ముగింపు కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు.200 మంది యువతి యువకులు తాము శిక్షణ పొందిన కర్ర సాము,కత్తి సాము విన్యాసాలను ప్రదర్శించారు.ఈ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.శిక్షణలో పాల్గొన్నా వారందరికీ సర్టిఫికెట్లు,జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలరాజ్ ముదిరాజ్ మాట్లాడుతూ...వేసవి కాలం సందర్భంగా విద్యార్థులతో పాటు యువతీ యువకుల కోసం ఈఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.తాము ఊహించిన దానికంటే ఎక్కువ మంది ఈశిక్షణలో పాల్గొన్నట్టు తెలిపారు.అనంతరం హైకోర్టు న్యాయవాది నరేష్ రెడ్డి,చార్మినార్ బాగ్ ఆర్ఎస్ఎస్ కార్యవాహరంగా రామాంజనేయులు మాట్లాడుతూ...భారతీయ యుద్ధ కలలు చరిత్ర ప్రస్తుత యువతకు ఎంతో అవసరం అన్నారు.సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ప్రాముఖ్యమైందని ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువతను ఏకతాటిపైకి తీసుకువచ్చే అవకాశం ఉంటుందన్నారు.గౌతమ్ ఎంటర్ప్రైజెస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన వారితో పాటు వారి కుటుంబ సభ్యులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మికులు ఇన్సూరెన్స్ కార్డులు చేయించుకోవాలి..

**భవన నిర్మాణ సంఘం రాష్ట్ర నాయకుడు నర్రా గిరి**

**శంషాబాద్,మే30(నమస్తే ఉదయం)**

శంషాబాద్ మండల కేంద్రంలోని భవన నిర్మాణ సంఘం రాష్ట్ర నాయకుడు నర్రా గిరి కార్మికులతో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా నర్రాగిరి మాట్లాడుతూ...భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు అందరూ ప్రభుత్వం నుంచి ఇచ్చే ఇన్సూరెన్స్ కార్మికులు అందరూ చేయించుకోవాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది.భవన నిర్మాణ,ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు పనిచేస్తున్న సందర్భంలో ప్రమాదం జరిగి మరణిస్తే ప్రమాద బీమా రూ.10లక్షల రూపాయలు ప్రభుత్వ సంక్షేమ బోర్డు నుండి ఆఆర్థిక సాయం అందుతుందన్నారు.కార్మికులు అనారోగ్యంతో సహజ మరణం చెందుతే రూ.2లక్షల రూపాయలు,కార్మికులు పనిచేస్తున్న సందర్భంలో కానీ ఏదైనా ప్రమాదం జరిగి అంగవైకల్యం చెందుతే రూ.5 లక్షల రూపాయలు,కార్మికుల పిల్లల పెళ్లిళ్ల కోసం వివాహ ప్రోత్సాహం రూ.30వేల రూపాయలు,మహిళా కార్మికులు ప్రసూతి సహాయం 30వేల రూపాయలు,కార్మికులు ప్రమాదం జరిగి హాస్పిటల్ లో వైద్య చికిత్స చేసుకునే సమయంలో చికిత్స సహాయం రోజుకు 300 రూపాయలు,కార్మికులు మరణిస్తే రూ.30వేల రూపాయలు ఈ సౌకర్యాలను కార్మికులందరూ ప్రభుత్వం నుండి ఇచ్చే ఇన్సూరెన్స్ కార్డులను చేయించుకోవాలని కోరడం జరిగింది.ప్రభుత్వ నుండి వచ్చిన ప్రతి పథకాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీను,రాజు,నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సోమిరెడ్డి నగర్ లో పార్కులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి

## పార్క్ స్థలాలను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు


**లేఅవుట్ పార్కుల అభివృద్ధికి ప్రణాళిక**

**రాజేంద్రనగర్, మే 30 (నమస్తే ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలో పబ్లిక్ పార్కుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్టు డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి వెల్లడించారు. ఆయా కాలనీలు బస్తీల లేఔట్ల మధ్య పార్కుల కోసం కేటాయించిన స్థలాలను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. శనివారం ఉదయం హైదర్ గూడ డివిజన్ పరిధిలోని సోమిరెడ్డి నగర్, లక్ష్మీ రామ్ హరన్ అపార్ట్మెంట్ తదితర ప్రాంతాలలో డిప్యూటీ కమిషనర్ పర్యటించారు. అపార్ట్మెంట్ల మధ్య బస్తీల మధ్య ఉన్న పార్కు స్థలాలను పరిశీలించారు. మెయిన్ రోడ్లపై, ప్రధాన కాలనీలలో ఉన్న పబ్లిక్ పార్కుల మాదిరిగానే ఆయా హుడా లేఔట్ల మధ్య వదిలిన పార్కు స్థలాలను అభివృద్ధి చేయడంపై తాము దృష్టి సారిస్తున్నామని ఆయన స్థానికులకు తెలిపారు. తమ ప్రయత్నంలో భాగస్తులు కావాలని, అభివృద్ధికితమతో కలిసి రావాలని డిప్యూటీ కమిషనర్ ప్రజలను కోరారు. పార్కు స్థలాలను ప్రైవేట్ అవసరాలకు వాడుకున్న, చెత్త వేసిన, కబ్జా చేయడానికి ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వృద్ధురాలు అదృశ్యం

**రాజేంద్రనగర్, మే 30 (నమస్తే ఉదయం)**



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ హైదర్‌గూడ శివ నగర్ కాలనీ నివాసి లక్ష్మమ్మ అనే మహిళ అదృశ్యమైంది. ఈనెల 10వ తేదీన ఆమె తన స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పి నివాసం నుండి బయలుదేరింది, కానీ ఆమె గమ్యస్థానానికి చేరుకోలేదు. అప్పటి నుండి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె అదృశ్యమైన సమయంలో నీలి రంగు చీర ధరించి ఉంది. ఆమె వద్ద ఎలాంటి మొబైల్ ఫోన్ లేదు.కుటుంబ సభ్యులు బంధువులు, సమీప ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ, ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో రాజేంద్రనగర్ పోలీసులను కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 593/2026 అండర్ హై ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి, ఆమె ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కనిపించకుండా పోయిన మహిళ ఆచూకీ గురించి సమాచారం తెలిసిన వారు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెం: 8712568174 కు సమాచారం తెలియజేయాలని కోరారు.

## అదృశ్యమైన మహిళ

**రాజేంద్రనగర్, మే 30(నమస్తే ఉదయం)**



మహిళ అదృశ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం అఫ్రోజ్ నూర్జహాన్(54) అనే మహిళను గుర్తించడంలో రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయించారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతూ తన కుమారుడితో నివసిస్తున్న అఫ్రోజ్ నూర్జహాన్ 15 తేదీన కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా తన నివాసం నుండి వెళ్లిపోయి, అప్పటి నుండి తిరిగి రాలేదు. ఆమె కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలలో మరియు బంధువుల వద్ద విస్తృతంగా గాలించినప్పటికీ, ఆమె ఆచూకీ లభించలేదు. మానసిక పరిస్థితి: మానసికంగా అనారోగ్యంగా తప్పిపోయిన సమయంలో ముదురు నీలం రంగు దుస్తులు ధరించిందన్నారు. తప్పిపోయిన మహిళను చూసిన వారు లేదా ఆమె ఆచూకీ గురించి ఏమైనా సమాచారం తెలిసిన వారు వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను లేదా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవలసిందిగా కోరారు. సదరు మహిళ ఆచూకీ తెలిసిన వెంటనే (8712568174) మొబైల్ కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

## వృద్ధుడు అదృశ్యం

**రాజేంద్రనగర్, మే 30(నమస్తే ఉదయం)**



ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన రాజేంద్రనగర్‌పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ తెలిపిన వివరాలు ప్రకారం...రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 70 ఏళ్ల వయసున్న ముదుమల్ హనుమంతు అనే వ్యక్తి ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు. అందిన ఫిర్యాదు ప్రకారం ఈనెల 25 న సుమారు 1400 గంటలకు, అతను కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా తన నివాసం నుండి వెళ్లిపోయాడు . అప్పటి నుండి ఇంటికి తిరిగి రాలేదు.కనిపించకుండా పోయిన వ్యక్తి వద్ద మొబైల్ ఫోన్ లేదు. గత కొన్ని రోజులుగా అతని ఆరోగ్యం బాగోలేదని, స్వల్ప జ్ఞాపకశక్తి లోపంతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా, బంధువులు, పరిచయస్తులను విచారించినా అతని ఆచూకీ లభించలేదు.ఇంటి నుండి బయలుదేరేటప్పుడు అతను తెల్ల చొక్కా, నీలం గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ గురించి సమాచారం తెలిసిన వారు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవలసిందిగా లేదా 8712568174 నంబర్‌కు డయల్ చేయవలసిందిగా కోరడమైనది.

# పదవి విరమణ చేసిన సీనియర్ లైబ్రరీ అసిస్టెంట్ వలిహుస్సేన్

### వలి హుస్సేన్ దంపతులను ఘనంగా వీడ్కోలు సన్మానం చేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, అధికారులు

**రాజేంద్రనగర్, మే 30 (నమస్తే ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లోని నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ లో సీనియర్ లైబ్రరీ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వలిహుస్సేన్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వలి హుస్సేన్ ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తో పాటు గ్రంథాలయ సిబ్బంది, శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు. విశ్వవిద్యాలయ గ్రంథపాలకులు డాక్టర్ ఎన్ పీ రవికుమార్ ఆధ్వర్యంలో ఈ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం బోధనేతర సంఘం నేతలు, అలాగే లైబ్రరీ సిబ్బంది పాల్గొని విశ్వవిద్యాలయానికి మూడు దశాబ్దాలకు పైగా వలి హుస్సేన్ అందించిన సేవలను కొనియాడారు. పని పట్ల అంకితభావం, నిబద్ధతతో వలి హుస్సేన్ అందరికీ ఆదర్శంగా పనిచేశారని ఈ సందర్భంగా గ్రంథ పాలకులు డాక్టర్ ఎన్ పి రవికుమార్ అన్నారు. తమ తోటి ఉద్యోగులందరి సహకారంతో తనకు అప్పగించిన బాధ్యతలను తన శక్తి మేరకు నిర్వహించగలిగానని ఈ సందర్భంగా వలిహుస్సేన్ అన్నారు. రాజేంద్రనగర్ లోని నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ లో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హుస్సేన్ కుటుంబ సభ్యులు ఆయన శ్రేయోభిలాషులు పాల్గొని ప్రసంగించారు.





వలి హుస్సేన్ దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, జాయింట్ రిజిస్ట్రార్ శివాజీ



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలి

### మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, మే 30 (నమస్తే ఉదయం)**

గాంధీ భవన్ ప్రాంగణంలో ఉన్నటువంటి ఇందిరా భవన్ లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఏఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్, ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్ ఆధ్వర్యంలో జరిగిన మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గశీ సమావేశంలో కార్యక్రమంలో బండి రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లి నియోజకవర్గాల్లో బూత్ లెవెల్ ఏజెంట్లను, అన్ని డివిజన్లకు అధ్యక్షులను, ఇతర అనుబంధ సంఘాల కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సమావేశాన్ని ఉద్దేశించి మీనాక్షి నటరాజన్ తెలియజేశారు. పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామస్థాయి నుండి సంస్థగతంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన సలహాలు సూచనలను సమావేశంలో వివరించారు. కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బి ఎల్ ఎ ల నియామకాలపై నిర్వహించిన సమావేశాలపై పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్ పూర్తి స్థాయి నివేదికను అందించి పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను అంద చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ క్యాంటీన్ దుస్థితిపై మండిపడ్డ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్

**కూకట్ పల్లి, మే 30 (నమస్తే ఉదయం)**



కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్‌లో ఉన్న ఇందిరమ్మ క్యాంటీన్ తీవ్ర నిర్లక్ష్యానికి గురై, ఉన్న కంటేయినర్ తీసేసి గుడిసెలో నడపటం పట్ల మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చిన్న గుడిసెలో నడుస్తున్న క్యాంటీన్ పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాన్ని, అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రస్థాయిలో ఎండగట్టారు. కేసిఆర్ ప్రభుత్వంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఇక్కడి పేద ప్రజలకు, హమాలీల కోసం రూ. 5 లకే ఎంతో రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో అందించామని, నేటి ప్రభుత్వం కేవలం పేర్లు మార్చడానికే ప్రాధాన్యత ఇచ్చింది తప్ప, కనీస నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు. పేదల సంక్షేమం పట్ల ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఈ క్యాంటీన్ దుస్థితే నిదర్శనమని ఆయన విమర్శించారు. అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి క్యాంటీన్ కు షెడ్ వేయించి పరిసరాలను నిత్యం శుభ్రం చేయించాలని, పేదలకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిల్లా గోపాల్, నర్సింహా, అక్బర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 30(నమస్తే ఉదయం):**



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ ను శనివారం గద్వాల టౌన్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూల్ కు చెందిన వీరేష్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా కర్నూల్ నుంచి గద్వాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## కైతలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానిక నిరుపేదలకు...

### కలెక్టర్ కు వినతి పత్రం అందించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, మే 30 (నమస్తే ఉదయం)**



కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని కైతలాపూర్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానిక నిరుపేదలకు ఇవ్వాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ని ఆయన కలిసి కూకట్ పల్లి నియోజకవర్గం కైతలాపూర్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానిక నిరుపేదలకు, అలాగే కూకట్ పల్లి నియోజకవర్గంకు చెందిన విలేకరులకు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అమృత నగర్ తండావాసులకు 62 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించామని, అలాగే మిగిలినవి స్థానికులకు కేటాయిస్తూ, పత్రికా విలేకరులకు కేటాయించాలని కలెక్టర్ ని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు.. డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు తులసిరావు తదితరులు పాల్గొన్నారు..

## ఎడ్‌సెట్‌లో స్టేట్ ర్యాంకు సాధించిన గద్వాల జిల్లా విద్యార్థిని

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 30(నమస్తే ఉదయం):**



తెలంగాణలో బీఈడీ (దీ.జు౦) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్-2026 పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ మేరకు జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన జి.పవిత్ర 101.594 /150 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 240వ ర్యాంకు సాధించింది. గద్వాల పట్టణం రెవెన్యూ కాలనీకి చెందిన హేమలత వీరేంద్ర కుమార్ దంపతుల కుమార్తె పవిత్ర రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం పట్ల పట్టణ ప్రజలు అభినందించారు.

# ట్రాఫిక్ అంతరాయం లేని పట్టణంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

### ఎంక్రోచ్ మెంట్ తొలగింపు పనులకు ప్రజలు సహకరించాలి

### ట్రాఫిక్ అంతరాయంలేని పట్టణంగా తీర్చిదిద్దాం

### మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లపై ప్రత్యేక నిఘా

### అక్రమ రవాణ పై దృష్టిసారించం

### ట్రాఫిక్ అంతరాయం లేని పట్టణంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం: గద్వాల ట్రాఫిక్ సీఐ ఎం.విద్యాసాగర్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 30(నమస్తే ఉదయం):**



ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారిపై, ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్ మరియు ప్రమాదకరంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు గద్వాల ట్రాఫిక్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. శనివారం గద్వాల ట్రాపిక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గద్వాల పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. గద్వాల పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానిక సీఐతో పాటు అదనంగా ఇద్దరు లేదా ముగ్గురు ఎస్.ఐ లను కేటాయించనున్నట్లు తెలిపారు. గతంలో దాదాపు 16 మంది ఉన్న సిబ్బందిని, ప్రస్తుతం ఉన్నతాధికారుల చొరవతో మరింత పెంచి నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న పిల్లలు (మైనర్లు) బైక్‌లు మరియు ఇతర వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించామని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే సదరు వాహనాలను తక్షణమే సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన పిల్లల తల్లిదండ్రులను లేదా కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామని, నిబంధనలు పాటించని వారిపై భారీ జరిమానాలు ఉంటాయని స్పష్టం చేశారు.

"తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను ఇవ్వకూడదు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి, సురక్షిత ప్రయాణానికి సహకరించాలి అని కోరారు. జిల్లా కేంద్రంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు ట్రాఫిక్ పునరుద్ధరణ, ట్రాఫిక్ నియంత్రణ చేస్తూ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందన్నారు. గద్వాల పట్టణం కృష్ణవేణి చౌరస్తా అంబేద్కర్ చౌరస్తా, పాతబస్టాండ్ కొత్తబస్టాండ్ , కలెక్టరేట్ , జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని కేటాయించి, ట్రాఫిక్ నియంత్రించేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వాహనదారుడు ఎక్కడ పడితే అక్కడ వాహనాల పార్కింగ్ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణకు సంబంధించి అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, ఆర్టీసీ అధికారులను సంప్రదించి జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుల రాకపోకలు, మార్గాలను సులభతరం చేయాలని తెలిపారు. వాహనదా రులు ట్రాఫిక్ నియమాలు రోడ్డు నియమాలు పాటించి రోడ్డు ప్రమా దాలకు గురవకుండా సురక్షితంగా గమ్యం చేరుకోవాలని అన్నారు. వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించకూడదని దీనివల్ల ట్రాఫిక్ అంతరాయం కలు గుతుందని తెలిపారు.

**ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి:**

గద్వాల పట్టణంలో రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణల వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. గద్వాల మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డుకు ఇరువైపుల అక్రమణలు తొలగించేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని సూచించారు. మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డుకు ఇరువైపుల ఎక్కడ వరకు మార్కింగ్ చేశారో అక్కడ వరకు అక్రమణలు తొలగిస్తున్నట్లు, అక్రమణతొలగింపులు అడ్డగింతలు లేవని,రాజకీయ నాయకులు, వ్యాపారులు పట్టణ ప్రజలు అక్రమణలు తొలగింపులో సహకరిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తు లో ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా జిల్లాఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమణలు తొలగింపు దశలవారిగా కొనసాగుతుందన్నారు.

**అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి:**


గద్వాల పరిసర ప్రాంతాల్లో జరిగే ఇసుక, మట్టి, అక్రమ, పీడిఎస్ బియ్యం అక్రమ రవాణా పైనా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారని, నిబంధనలు మీరి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



## జలమండలిలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన ఈ-వ్యర్థాల రీసైక్లింగ్

**హైదరాబాద్, మే 30(నమస్తే ఉదయం)**

జలమండలి ప్రధాన కార్యాలయం, వివిధ విభాగాల్లో గత 15 నుండి 20 సంవత్సరాలుగా నిల్వలో ఉన్న ఈ-వ్యర్థాలు , వాడుకలో లేని ఐటీ పరికరాల శాస్త్రీయ నిర్వహణ, రీసైక్లింగ్ ప్రక్రియను ప్రారంభించింది. ఈ-వ్యర్థాల సేకరణ, రవాణా , పర్యావరణ హిత రీసైక్లింగ్ కోసం తెలంగాణ గ్రీన్ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా ఓ రిఫైనింగ్ సంస్థను అధికారిక ఏజెన్సీగా నియమించింది. నిర్వహణకు ఎంపిక చేసిన వస్తువుల్లో పాత ప్రింటర్లు, సీఆర్‌టీఈ మానిటర్లు, సీపీయూలు, యూపీఎస్ వ్యవస్థలు, ఇతర కాలం చెల్లిన ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయి. వీటిని ప్రస్తుత ఈ-వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ మార్గదర్శకాలకు అనుగుణంగా సురక్షితంగా, బాధ్యతాయుతంగా రీసైక్లింగ్ చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా హరితాభివృద్ధికి జలమండలి తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోంది. పాత ఎలక్ట్రానిక్ పరికరాల రీసైక్లింగ్ ద్వారా వ్యర్థాల నిర్వహణలో ఆదర్శప్రాయ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ-వ్యర్థాల లోడింగ్, తరలింపు ప్రక్రియ కొనసాగుతోందని, వాటిని అధీకృత రీసైక్లింగ్ కేంద్రానికి తరలించి పర్యావరణహిత పద్ధతుల్లో నిర్వహించనున్నట్లు జలమండలి వెల్లడించింది.



## రసాయన డ్రమ్ములు తరలిస్తున్న డీసీఎం పట్టివేత

### స్థానికుల ఫిర్యాదుతో పిసిబి టాస్క్ ఫోర్స్ అధికారుల తనిఖీలు

### స్నేహ ఫార్మా వద్ద పట్టుబడ్డ వాహనం

**పటాన్ చెరు మే 30( నమస్తే ఉదయం)**

బొల్లారం పారిశ్రామిక వాడలోని స్నేహ ఫార్మా పరిశ్రమకు చెందిన వ్యర్థ రసాయనాలను డ్రమ్ముల్లో డీసీఎం వ్యాన్ లో తరలిస్తున్నారన్న అనుమానంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులతో పిసిబి టాస్క్ ఫోర్స్ బృందం పారిశ్రామిక వాడలో తనిఖీలు నిర్వహించారు . ఈ మేరకు స్థానిక ఆసానికుంట నుంచి పరిశ్రమలకు వెళ్లే దారిలో వద్ద డీసీఎం లో తీసుకు వస్తున్న 39 డ్రమ్ములను సనత్ నగర్ పిసిబి ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ చక్రపాణి బృందం సభ్యులతో విస్తృత తనిఖీలు నిర్వహించి అదుపులోకి విచారణ చేపట్టారు. డ్రమ్ముల్లో నిలువ చేసిన వ్యర్థ రసాయనాల శాంపిల్స్ సేకరించారు. సంగారెడ్డి కి చెందిన పెన్నార్ పరిశ్రమ నుంచి వ్యర్థాలను తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కాగా రామచంద్రపురం పిసిపి పెట్రోలింగ్ మరో బృందం సమాచారం అందుకున్న అనంతరం ఘటన స్థలానికి చేరుకున్నారు. విచ్చలవిడిగా పరిశ్రమలు వ్యర్థ జలాలను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారని, పరిశ్రమ వాడకు ఆనుకొని ఉన్న ఆసాని కుంటలో మండుటెండలో కూడా ఆసాని కుంటలో వ్యర్థా జలాలతో నిండి ఉండడం వల్ల స్థానికులు అనుమానస్పదంతో పిసిబి అధికారులకు చారవాణి ద్వారా సమాచారం ఇచ్చారు. సేకరించిన శాంపిల్స్ సనత్ నగర్ ల్యాబ్ లో పరీక్షించిన అనంతరం 5 రోజుల్లో రిపోర్టుల ఆధారంగా పరిశ్రమ పై కఠిన చర్యలు తీసుకుంటామని పిసిబి టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ చక్రపాణి వెల్లడించారు. కార్యక్రమంలో పిసిబి టాస్క్ ఫోర్స్ ఏఈ రిత్విక్, సభ్యులు, స్థానికులు, పరిశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సార్వజనిక గోసేవ కార్యక్రమం

### పంచగవ్యంతో సర్వపాప హరణం..

**రాజేంద్రనగర్,మే30(నమస్తే ఉదయం)**

అధికమాసం,ఆర్ఎస్ఎస్ శతాబ్ది సందర్భంగా గోసేవ కార్యక్రమం అత్తాపూర్‌లోని శ్రీఅనంత పద్మనాభస్వామి దేవాలయం పరిధిలో ఉన్న శ్రీకృష్ణ గోశాలలో శనివారం అధికమాసం,ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సార్వజనిక గోసేవ కార్యక్రమం నిర్వహించారు. పంచ పరివర్తన కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణతో పాటు గోవుల సంరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గోమాత సేవ భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం కలిగి ఉందని పేర్కొంటూ,భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని గోసేవలో భాగస్వాములయ్యారు. గోసేవ ఎంతో గొప్పదని, గోమాత ముక్కోటి దేవతల స్వరూపమని చెప్పారు. గోవు పేడ,మూత్రం,పాలు, పెరుగు,నెయ్యి కలిపితే పంచగవ్యం అవుతుందని, దీన్ని స్వీకరించిన వారికి సమస్త పాపాలు తొలగిపోవడమే గాకుండా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. గోవులను పోషించాలని, గోశాలలకు సహకరించి అనుగ్రహం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు,గోభక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.